సాక్షి ప్రకాశం

శుక్రవారం | 31 | మార్చి | 2023



రంకెలేసిన ఒంగోలు గిత్తలు

శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఒంగోలు గిత్తలు విజేతలయ్యాయి. - 8లో..



పండగ పూట విషాదం

చీరాలలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందడంతో పండగ పూట విషాదం నెలకొంది. బాధిత కుటుంబాల ఆవేదన వర్ణనాతీతంగా మారింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

ఇఫ్తార్ : సా॥ 06:27 ని॥
శుక్రవారం

సహర్ : ఉ॥ 04:43 ని॥
శనివారం

రంజాన్ వేళలు





కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు, బాలినేని ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య దంపతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు

రామయ్య కల్యాణం కనులారా వీక్షించి..

- ఊరూ..వాడా శ్రీరామనవమి ఉత్సవాలు
- కన్నుల పండువగా సీతారాముల కల్యాణాలు
- ఒంగోలులో ఎమ్మెల్యే బాలినేని ఇంట కల్యాణోత్సవం
- పెద్దదోర్నాలలో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు
- జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీలు మలికాగర్గ్, వకుల్ జిందాల్ దంపతుల పూజలు

రామ నామస్మరణతో జిల్లా మార్మోగింది. ఊరూ..వాడ జానకీరాముల కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. దేవదేవుడి కల్యాణాన్ని భక్తజనం కనులారా వీక్షించి పులకించిపోయింది. భక్తులతో రామాలయాలు కిటకిటలాడాయి. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి నీల మేఘ శ్యాముడిని దర్శించుకున్నారు. వాడవాడలా చలువ పందిళ్లు వేసి సీతారాములకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఒంగోలులో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసం వద్ద వేడుకగా సీతారాముల కల్యాణం జరిపించారు. పెద్దదోర్నాల కోదండరామస్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణంలో రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన రాములోరి కల్యాణంలో ఎస్పీలు మలికాగర్గ్, వకుల్ జిందాల్ దంపతులు పాల్గొని పూజలు చేశారు.

ఒంగోలు: వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసం వద్ద జానకమ్మ, జగదభిరాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. చలువ పందిట్లో ప్రత్యేక వేదికపై స్వామివారు ఆశీనులవగా భారీగా భక్తులు పాల్గొన్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు, వారి కుమారుడు, కోడలు, మనుమడు బాలినేని ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య, సిద్దాన్‌రెడ్డి పీఠలపై కూర్చోగా వేద పురోహితులు మఠంపల్లి దక్షిణామూర్తి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. వేదమంత్రాలు చదువుతూ వాటి అర్థాన్ని వివరిస్తూ శ్రీరాముని గొప్పతనం గురించి తెలియజేశారు. భద్రాచలంలో స్వామివారికి ఏ విధంగా అయితే కల్యాణం జరుగుతుందో అదే తరహాలో ఇక్కడ కూడా జరిపారు. హాజరైన భక్తజనానికి పానకం, వడపప్పుతో పాటు లడ్డూ ప్రసాదం, వాటర్ బాటిళ్లు, కూల్‌డ్రింకులు, మజ్జిగ పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులతో పాటు మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తనివితీరా తిలకించారు. గణపతి పూజ, కంకణ ధారణ, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ కార్యక్రమాన్ని స్వయంగా చూస్తూ భక్తులు జై శ్రీరాం నినాదాలతో ప్రాంగణాన్ని ప్రతిధ్వనింపజేశారు. పీఠలపై కూర్చున్న బాలినేని దంపతులకు వైవీ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ, భద్రారెడ్డి సతీమణి స్వయంగా విచ్చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. మరోవైపు శ్రీకావ్య, ప్రణీత్‌రెడ్డిలకు కూడా శ్రీకావ్య పుట్టింటి నుంచి కుటుంబీకులు విచ్చేసి పట్టువస్త్రాలు అందజేశారు. రెండు జంటలు తమ తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడంతో పాటు తలంబ్రాలు సమర్పించారు. అనంతరం సమీపంలోని ఖాళీస్థలంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది కుటుంబాలతో సహా విచ్చేసి స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్మన్ మీనాకుమారి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, కటారి శంకర్, గంటా రామానాయుడు, ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్ ఈదుపల్లి గురునాథం, వీరాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ దుగ్గిరెడ్డి ఆంజనేయరెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

ఒంగోలు టౌన్: శ్రీ రాముడు ఆచరించిన జీవన విధానం పరిపూర్ణ మానవ జీవితానికి నిలువెత్తు నిదర్శనమని, యావత్ మానవాళికి ఆదర్శనీయమని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో గురువారం నిర్వహించిన స్వామివారి కల్యాణ మహోత్సవంలో ప్రకాశం జిల్లా ఎస్పీ మలికాగర్గ్, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ దంపతులు పాల్గొన్నారు. స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. వేద పురోహితులు మఠంపల్లి దక్షిణామూర్తి శ్రీసీతారాముల కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఎస్పీ దంపతులు ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైమ్) శ్రీధరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీపీవో ఎం.సులోచన, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేంద్రరావు, ఆర్ఐలు, అర్చకులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎస్పీ దంపతులు మలికాగర్గ్, వకుల్‌జిందాల్

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆదిమూలపు...



కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దదోర్నాల: శ్రీరామనవమి పర్వదినాన్ని మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌తో పాటు ఆయన తనయుడు, జార్జి విద్యాసంస్థల డైరెక్టర్ ఆదిమూలపు విశాల్ పాల్గొన్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్‌తో పాటు ఆయన తనయుడు ఆదిమూలపు విశాల్ పట్టువస్త్రాలను భక్తిశ్రద్ధలతో స్వామివారికి సమర్పించారు. మంగళవాయిద్యాలు, అర్చకుల వేదమంత్రాల నడుమ శ్రీ సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ అర్చకులు బెదెరే రామప్రసాదశర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి ఆదిమూలపు సురేష్, ఆయన తనయుడు విశాల్ ప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

ఒంగోలులో 'గడపగడపకు మన ప్రభుత్వం'

- రేపటి నుంచి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఒంగోలు నగరంలో ప్రారంభించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో 32వ డివిజన్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా గురువారం ఆ డివిజన్‌లోని గద్దలగుంట వార్డు సచివాలయంలో ముందస్తు సన్నాహక సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీకి చెందిన డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలతతో కలిసి వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. డివిజన్ పరిధిలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటింటికీ అందిన సంక్షేమ ఫలాలకు సంబంధించిన జాబితాలను సిద్ధంగా ఉంచుకోవాలని వార్డు సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు కమిషనర్ సూచించారు.

పిటికాయగుళ్లలో ఏప్రిల్ 1న ఎడ్ల పోటీలు

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్లలో పట్టాభిరామస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీ రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు బహుమతులుగా వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలను దాతలు అందజేయనున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు 93920 56881, 98660 54720, 98664 35756 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.


ఏప్రిల్ 2న బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

ఒంగోలు: బాలుర సీనియర్ క్రికెట్ జట్టును ఏప్రిల్ 2వ తేదీ ఎంపిక చేయనున్నట్లు ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మొగిలిశెట్టి వివేకానంద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మంగమూరు రోడ్డులోని ఆశ్రమం వద్ద గల ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మినీలార్డ్స్ క్రికెట్ గ్రౌండులో ఎంపిక జరుగుతుందన్నారు. క్రీడాకారులు ఉదయం 10 గంటల్లోపు యూనిఫాంతో వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కోచ్ జి.చంద్రశేఖర్ (92462 22999, 70132 60949)ను సంప్రదించాలని సూచించారు.

ఏప్రిల్ 17న శివసాగర్ స్మారక సాహిత్య సభ

ఒంగోలు: ప్రఖ్యాత కవి, సాహిత్యవేత్త, విప్లవకారుడు అయిన కేజీ సత్యమూర్తి (శివసాగర్) 11వ వర్ధంతిని ఏప్రిల్ 17న స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహించనున్నట్లు సామాజిక న్యాయ పోరాట సమితి ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సామాజిక న్యాయ పోరాట సమితి, బహుజన రచయితల వేదిక, దళిత చైతన్య స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సభకు ముఖ్య అతిథులుగా ప్రముఖ సాహితీవేత్తలు, ఉద్యమకారులు డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపారాణి, పేరూరి మురళీకుమార్, క్లోపల్లి రాంగోపాల్, ప్రముఖ న్యాయవాది గొల్లపల్లి అంబేడ్కర్‌తో పాటు సాహిత్య, సామాజిక, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

కొత్త బోర్లు వద్దు



పశ్చిమ ప్రకాశంలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దాదాపు ఏడు మండలాల్లోని 53 గ్రామాల్లో జలాలు ప్రమాదకర స్థాయిలో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. వాల్టా చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఎవరూ బోర్లు వేయొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అలాగే, నీటి మట్టం పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

- 53 గ్రామాల్లో తగ్గుతున్న భూగర్భ జలాలు
- పటిష్టంగా వాల్టా చట్టం అమలు
- పశ్చిమ ప్రకాశంలోనే అధికంగా భూగర్భ జలాల వినియోగం
- మార్కాపురం ప్రాంతంలో వెయ్యి అడుగుల లోతు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో వర్షాధారంగా సాగయ్యే పంటల కోసం రైతులు వేసిన బోర్లు ఇబ్బందికరంగా మారాయి. దాదాపు వెయ్యి అడుగల లోతులో జల పడుతోంది. దీంతో ఫ్లోరైడ్ వాటర్ పైకి వస్తోంది. ఈ నేపథ్యంలో భూగర్భ జలాల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర భూగర్భ జలాల శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం, గ్రామీణ నీటి సరఫరా అధికారుల సర్వే ప్రకారం పశ్చిమ ప్రకాశంలోని 53 గ్రామాల్లో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు ప్రకటించారు. వాల్టా (వాటర్, ల్యాండ్, ట్రీస్ యాక్ట్ 2002) చట్టాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన 53 గ్రామాల్లో అనధికారికంగా ప్రభుత్వ భూముల్లో వేసిన బోర్లను తొలగిస్తూ విద్యుత్ కనెక్షన్లు కూడా తీసివేస్తున్నారు. ఇటీవల మార్కాపురం మండలంలోని జమ్మనపల్లి గ్రామంలో అనధికారంగా ప్రభుత్వ పోరంబోకు భూముల్లో వేసిన 8 బోర్లను సీజ్ చేశారు.

ఆ గ్రామాలు ఇవే...

ప్రమాదకర స్థాయిలో భూగర్భ జలాలు ఉన్న గ్రామాల జాబితాను అధికారులు విడుదల చేశారు.

- ✔ మార్కాపురం మండలం : బడెఖాన్‌పేట, భూపతిపల్లి, బొందలపాడు, చింతకుంట, జమ్మనపల్లె, కోలభీమునిపాడు, మాల్యవంతునిపాడు, నికరంపల్లి, పెద్దనాగులవరం, తిప్పాయపాలెం, వేములకోట
- ✔ కంభం : కంభం, జంగంగుంట్ల, కందులాపురం, ఎల్.కోట
- ✔ దోర్నాల : చిన్నదోర్నాల, దోర్నాల, నల్లగుంట్ల, పెద్దబొమ్మలాపురం
- ✔ గిద్దలూరు : చెట్టిరెడ్డిపల్లి, గడికోట, కంచిపల్లి, కృష్ణంశెట్టిపల్లి, మొదంపల్లి, ముండ్లపాడు, నరసింహునిపల్లి, సంజీవరాయునిపేట, తిమ్మాపురం
- ✔ పెద్దారవీడు : బద్వీడు, బోయదగుంపుల, చట్లమిట్ట, కంభంపాడు, దేవరాజుగట్టు, గొబ్బూరు, ఓబులక్కపల్లి, పెద్దారవీడు, ప్రగళ్లపాడు, ఎస్.కొత్తపల్లె, సానికవరం, తంగిరాళ్లపల్లె, తోకపల్లె
- ✔ పుల్లలచెరువు : చాపలమడుగు, కవలకుంట్ల, కొమరోలు, మరివేముల, నర్సాపురం, రాచకొండ, శతకోడు, ఎండ్రపల్లె
- ✔ యర్రగొండపాలెం : అమ్మానిగుడిపాడు, బిల్లగొందిపేంట, లింగంవానిపల్లి, రామచంద్రపురం.

ఏపీ వాల్టా చట్టం ప్రకారం ఈ గ్రామాల్లో తాగునీటికి తప్ప ఇతర బోరు బావుల తవ్వకాలు, డీప్ బోర్లు, ఇసుక తవ్వకాలను ప్రభుత్వం నిషేధించింది. వాడాల్సిన నీటి కంటే ఎక్కువగా ఉపయోగించినందున వాల్టా చట్టాన్ని అమలు చేస్తున్నారు.

భూగర్భ జలాల పెంపుదలకు చర్యలు...

భూగర్భ జలాల పెంపుదలకు అధికారులు చర్యలు తీసుకున్నారు. మైక్రో ఇరిగేషన్, డ్రిప్ సిస్టాన్ని ప్రోత్సహిస్తున్నారు. దీని వల్ల 2 ఎకరాలకు ఉపయోగించే నీటిని డ్రిప్ సిస్టమ్ ద్వారా 5 ఎకరాల వరకు పారించుకోవచ్చు. మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు. కొత్త బోర్లను నిషేధించారు. తాగునీటి అవసరాలకు మాత్రమే అనుమతిస్తున్నారు.

పక్కాగా వాల్టా చట్టం అమలు



ప్రభుత్వం ప్రకటించిన 53 గ్రామాల్లో మండల స్థాయిలో తహసీల్దార్ అధ్యక్షతన ఏర్పాటైన వాల్టా కమిటీ పటిష్టంగా వాల్టా చట్టాన్ని అమలు చేస్తోంది. భూగర్భ జలాల వాడకంపై గ్రామ, మండల స్థాయిలో ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు. ప్రజలు కూడా విచ్చలవిడిగా బోర్లు వేసి నీటిని వృథా చేయడం మానుకోవాలి. మొక్కలు పెంచి వాటిని సంరక్షించాలి.

– విద్యాసాగర్, గ్రౌండ్ వాటర్ డిప్యూటీ డైరెక్టర్, ఒంగోలు

ప్రజలకు నీళ్లివ్వండి

- అవసరమైనచోట బోర్లు వేసేందుకు సొంత నిధులిస్తా
- ఆర్‌డబ్ల్యూఎస్ సమీక్షలో మంత్రి ఆదిమూలపు సురేష్



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

మార్కాపురం: నియోజకవర్గ ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదేశించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మార్కాపురంలోని తన కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. ప్రజలు తాగేందుకు నీళ్లివ్వాలని, తక్షణమే నీటి సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చోట బోర్లు వేసేందుకు తన సొంత నిధులు ఇస్తానని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్న పరిస్థితులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ బి.రామకృష్ణ మంత్రికి వివరించారు. బోర్లు వేస్తే నీరు వచ్చే అవకాశాలున్న ప్రాంతాలను పరిశీలించి తక్షణమే బోర్లు ఏర్పాటు చేయాలని, పెద్దదోర్నాల మండలంలోని పెద్దబొమ్మలాపురం, చిన్నదోర్నాల గ్రామాల ప్రజలకు నీరు సరఫరా చేసేందుకు మూడు బోర్లు వేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పుల్లలచెరువు మండలంలోని చెన్నంపల్లి, గంగవరం గ్రామాల్లో బోర్లు వేస్తామని, దూరం నుంచి పైప్‌లైన్ ద్వారా నీరు తరలించేందుకు తమ పార్టీకి చెందిన నాయకులు ఏర్పాట్లు చేస్తారని ఆయన అన్నారు. తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న మండల కేంద్రమైన పుల్లలచెరువుకు పైపులైన్ ద్వారా సాగర్‌నీరు సరఫరా చేసే అవకాశం ఉందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే కుళాయిల ఏర్పాటుకు ఆయన రూ.5 లక్షలు మంజూరు చేశారు. త్రిపురాంతకం మండలంలోని దువ్వలి, లేళ్లపల్లి, యర్రగొండపాలెం మండలంలోని అన్ని గ్రామాల్లో నీటి సమస్య అధికంగా ఉందని, ఆయా గ్రామాలకు నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. గతంలో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయగా, బిల్లుల విషయం సీఎం దృష్టిలో ఉందని, ఏప్రిల్ నెలలో బిల్లులు మంజూరవుతాయని ఆయన అన్నారు.

హైస్కూళ్ల అభివృద్ధికి సహకారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: జిల్లా పరిషత్ హైస్కూళ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. మండలంలోని దేవరపాలెం జిల్లా పరిషత్ హైస్కూలు అభివృద్ధికి బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ నుంచి సహకారం అందిస్తామన్నారు. బుధవారం రాత్రి హైస్కూలు ఆవరణలో నిర్వహించిన వార్షికోత్సవంలో బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవరపాలెం హైస్కూలులో ఇప్పటికే తరగతి గదులు, కంప్యూటర్ రూము, ప్రహరీలు, ఇతర వసతులను బూచేపల్లి కుటుంబం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం హైస్కూలు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బూచేపల్లి వెంకాయమ్మను హైస్కూలు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హైస్కూలు హెచ్‌ఎం భాస్కర్‌శాస్త్రి, స్థానిక నాయకులు గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, పులి వెంకటరెడ్డి, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగభైరవ సాహితీ పురస్కారానికి ఆహ్వానం

ఒంగోలు టౌన్: నాగభైరవ సాహితీ పురస్కారం -2023కిగానూ కథాసంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటుగా ఇతర రాష్ట్రాలు, దేశాల్లో స్థిరపడిన తెలుగు రచయితలు 2019 నుంచి 2022లోపు ప్రచురించిన కథా సంపుటాలను పోటీకి పంపించాలని కోరారు. ఒక్కొక్కరు నాలుగేసి ప్రతులను పంపించాలని, విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.10,000, ద్వితీయ బహుమతిగా రూ.5 వేలను అందజేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 20వ తేదీ నిర్వహించే సభలో బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. రచయితలు ఏప్రిల్ 30వ తేదీలోపు వారి రచనలను డాక్టర్ ఆదిభైరవ నారాయణ, శ్రీవెంకటసాయి రెసిడెన్సీ, 2వ లైను, రామయ్య నగర్, ఒంగోలు–2 చిరునామాకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు 98497 99711 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

20 కేజీల గంజాయి స్వాధీనం

● గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల అరెస్టు

పొదిలి: గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు. పట్టణంలోని పిచ్చిరెడ్డితోట ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న గురునాథం సుబ్బారావు, గురునాథం కోటేశ్వరి, సావిత్రిలను అదుపులోనికి తీసుకొని విచారించారు. వారి వద్ద ఉన్న తెల్లని ప్లాస్టిక్ కవర్‌లో ఉన్న 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు పంపించామని, మరికొంత మందిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు.

రెవెన్యూ ఉద్యోగి ఆత్మహత్య

ఒంగోలు టౌన్: కుటుంబసభ్యుల అనారోగ్య కారణాతో రెవెన్యూ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ధారావారితోటలో నివాసం ఉండే విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ మారం వెంకటరెడ్డి (57) కొద్ది రోజుల నుంచి గుండెనొప్పితో బాధపడుతున్నాడు. ఆయనకు మూడు నెలల క్రితం బైపాస్ సర్జరీ జరిగింది. ఆయన భార్య విజయలక్ష్మి ఏడాది కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతుండగా ఆమకు కిమోథెరపీ చేయిస్తున్నాడు. భార్యా భర్తలు ఇద్దరు అనారోగ్యంతో బాధ పడుతుండడం వెంకటరెడ్డిని కుంగదీసింది. దీంతో ఇంట్లోని పై అంతస్తులో లుంగీతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇంటి పనిచేస్తూ పై అంతస్తుకు వెళ్లిన కోడలు చైతన్య భారతికి ఫ్యాన్‌కు వేలాడుతూ వెంకటరెడ్డి కనిపించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో వెంకటరెడ్డి భార్య విజయలక్ష్మి మేడ మీదకు వెళ్లింది. అత్తాకోడళ్లు ఇద్దరూ కలిసి కిందకు దించి చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వైభవంగా వసంత నవరాత్రులు



అశ్వవాహనంపై శ్రీబాలాత్రిపురసుందరీదేవి

త్రిపురాంతకం: స్థానిక శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో వసంత నవరాత్రి మహోత్సవం సందర్భంగా చండీహోమం, అశ్వవాహనసేవను గురువారం వైభవంగా నిర్వహించారు. త్రిపురాంతకంలోని అమ్మవారి ఆలయంలో ఉగాది నుంచి వసంత నవరాత్రి మహోత్సవాలు జరుగుతున్నాయి. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, ఉభయదాతల పూజలు, అమ్మవారి ఆలయ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రీబాలాత్రిపురసుందరీదేవి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. నాగఫణిశాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితులు చండీహోమం చేశారు. అర్చకుడు ప్రసాదశర్మ భక్తులచే కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయాల ఈవో చెన్నకేశవరెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పద్మజ మల్లికార్జున్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కుంగిన రహదారి

● గుంతలో ఇరుక్కొని గాలిలోకి లేచిన ఇసుక టిప్పర్



గాలిలో లేచిన టిప్పర్ ముందు భాగం

కొమరోలు: రహదారి కుంగడంతో దానిపై వెళుతున్న ఇసుక లోడు టిప్పర్ గాలిలో లేచింది. ఈ సంఘటన హనుమంతరాయునిపల్లె గ్రామ సమీపంలో జరిగింది. గురువారం కొమరోలు వైపు నుంచి శింగరిపల్లె వైపుగా ఇసుక లోడుతో వెలుతున్న టిప్పర్ ఓ గుంత వద్ద ఇసుక లోడుకు వెనుకవైపున రోడ్డు కుంగడంతో టిప్పర్ వెనుక వైపు చక్రాలు గుంతలో ఇరుక్కుపోయి టిప్పర్ ముందు భాగం పైకి లేచింది. దీంతో అటు వైపుగా రాకపోకలు నిలిచిపోయాయి.



యజ్ఞోపవేతాన్ని చూయిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి



పెద్దదోర్నాల: స్వామికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ

కమనీయం.. కల్యాణోత్సవం..

శ్రీరామనవమిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా సీతారామ కల్యాణోత్సవాలను కనులపండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య కల్యాణ ఘట్టం నేత్రపర్వంగా సాగింది. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కల్యాణ అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



కల్యాణ వేదికపై సీతా లక్ష్మణ సమేత శ్రీరాముడు విగ్రహాలు



వింజామరుల సేవలో బాలినేని కుటుంబసభ్యులు



నిర్మల్‌నగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సీతారామ కల్యాణోత్సవం



పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఆవరణలో కల్యాణోత్సవంలో ప్రకాశం, బాపట్ల ఎస్పీలు మలికాగర్గ్, వకుల్‌జిందాల్, ఏఎస్పీ నాగేశ్వరరావు దంపతులు



సంతపేట సాయిబాబా ఆలయంలో సీతారాముల కల్యాణంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు



కల్యాణోత్సవంలో పీటలపై కూర్చున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రణీత్‌రెడ్డి దంపతులు



పెద్దదోర్నాలలో ప్రసాదం పంపిణీ చేస్తున్న మంత్రి



బాలినేని నివాసం సమీపంలో భక్తులకు అన్నదానం

పండగ పూట విషాదం

● వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి
● ఒకరు పేరాల వాసి, మరొకరు వాడరేవు యువకుడు
● కేసు నమోదు చేసిన పోలీసులు



వడ్లమూడి సుబ్బారావు మృతదేహం



సాగర్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి, కుటుంబసభ్యులు

చీరాల: శ్రీరామనవమి పండుగరోజు అందరూ ఆనందంగా ఉంటే.. ఆ రెండు కుటుంబాల్లో మాత్రం విషాదం నెలకొంది. అత్తగారి ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అమ్మా చీరాలకు వెళ్లి బైక్ సర్వీసింగ్ చేయించుకొస్తానని చెప్పి ఐదు నిమిషాల్లోనే మరో యువకుడు ట్రాక్టర్ ఢీకొని మృత్యువాతపడ్డాడు. ఈ రెండు హృదయ విదారక ఘటనలు చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే చోటుచేసుకున్నాయి.

పేరాల హరిప్రసాద్‌నగర్ పోలేరమ్మ గుడి సమీపంలో నివసించే వడ్లమూడి సుబ్బారావు(49) పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో సీనియర్ కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి తన అత్తగారి ఊరు గవినివారిపాలెం వెళ్లి ద్విచక్రవాహనంపై పేరాల వస్తున్నాడు. గవినివారిపాలెం-పిట్టువారిపాలెం గ్రామాల మధ్యలోని చప్టా సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం సుబ్బారావును ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలైన సుబ్బారావు ఘటన స్థలంలోనే మృతిచెందాడు. తెల్లవారుజామున పొలాలకు నీరుపెట్టేందుకు వచ్చిన రైతులు గాయాలతో మృతిచెంది ఉన్న సుబ్బారావును చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. పట్టణంలో పేరొందిన సీనియర్ కాంపొండర్ సుబ్బారావు మృతితో పేరాల హరిప్రసాద్‌నగర్‌లో విషాదం అలముకుంది. అందరినీ నవ్వుతూ పలకరించి తలలో నాలుకలా ఉండే సుబ్బారావు మృతితో అటు కుటుంబ సభ్యులు, ఇటు స్నేహితులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతమంతా విషణ్ణవదనంతో నిండిపోయింది.

అమ్మానాన్నల ఆశల దీపం ఆరిపోయింది..

వాడరేవు రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టడంతో వాడరేవుకు చెందిన గరికిన సాగర్ (19) మృతిచెందాడు. గురువారం ఉదయం తన వాహనాన్ని సర్వీసింగ్ చేయించుకునేందుకు ఇంటి నుంచి బయలుదేరిన ఐదు నిమిషాల్లోనే ట్రాక్టర్ ద్వారా వచ్చిన మృత్యువు సాగర్‌ను చిదిమేసింది. సాగర్‌కు బుధవారంతో ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయ్యాయి. అమ్మా ఇంటర్మీడియట్ పరీక్షలు బాగా రాసాను.. బాగా చదువుకుని నిన్ను, నాన్నను మంచిగా చూసుకుని చెల్లికి పెళ్లి చేస్తానని చెప్పిన ఆ ఇంటి దీపం ఆరిపోవడంతో సాగర్ తల్లి, కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాల వద్ద విలపిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. సాగర్ తండ్రి సముద్రంలో వేట చేస్తుండగా.. తల్లి చేపల అమ్మకాలు చేస్తూ సాగర్, అతని చెల్లిని చదివిస్తున్నారు. కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు సాగర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

రంకెలేసిన ఒంగోలు గిత్తలు

●శ్రీరామనవమిని పురస్కరించుకొని జిల్లాలో హోరాహోరీగా ఎడ్ల పోటీలు

మార్కాపురం: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని భూపతిపల్లె పంచాయితీలోని బొడిచెర్లలో ఎడ్ల పోటీలు నిర్వహించారు. స్వామి కల్యాణోత్సవం అనంతరం గ్రామ శివారులో నిర్వహించిన పోటీల్లో పెద్దారవీడు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన ఎం శ్రీనివాసుల ఎడ్ల జత 2,120, 2100 అడుగుల దూరం లాగి ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించిగా, పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన అంజిరెడ్డి ఎడ్ల జత 2094 అడుగులు, పెద్దారవీడు మండలం కలనూతల గ్రామానికి చెందిన జశ్వంత్ ఎడ్ల జత 1400 అడుగులు, జేపీ చెరువుకు చెందిన రవితేజ ఎడ్ల జత 804.10 అడుగులు లాగి తృతీయ, పంచమ బహుమతులు సాధించాయి.

హనుమంతునిపాడు: శ్రీరామనవమిని పురస్కరించుకొని మండలంలోని వెంగపల్లిలో జిల్లాస్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించారు. పోటీలను ఆలయ కమిటీ అధ్యక్షుడు రాయి వెంకటేశ్వరెడ్డి, నిర్వాహకులు వీరారెడ్డిలు ప్రారంభించారు. పోటీల్లో నాలుగు జతల ఎడ్లు పాల్గొన్నాయి. పోటీలో దర్శికి చెందిన గానుగపెంట రాజశేఖర్ ఎడ్ల జత సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచాయి. టంగుటూరుకు చెందిన నందమూరి తారకబుల్స్ మక్కెన కోటేశ్వరరావు ఎడ్ల జత రెండో స్థానంలో, బొర్రా రవితేజ ఎడ్ల జత మూడవ స్థానంలో, షేక్ జాఫర్ సాహెబ్ ఎడ్ల నాల్గవస్థానంలో నిలిచాయి. విజేతలకు రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందజేశారు.



బేస్తవారిపేట: బండను లాగుతున్న ఎడ్లు

గిద్దలూరు రూరల్: శ్రీరామనవమి పండుగ సందర్భంగా మండలంలోని పొదలకుంటపల్లెలో వీరాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీల్లో పల్నాడు జిల్లా ఎడ్లు సత్తా చాటాయి. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన ఓబయ్యయాదవ్ ఎడ్లు 3348 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి కింద రూ.40 వేలు, సంతమాగులూరుకు చెందిన తేజశ్రీ రెడ్డి ఎడ్లు 2786 అడుగులు లాగి రెండో బహుమతి రూ.30 వేలు, నంద్యాల జిల్లా బోయిలకుంట్లకు చెందిన సుభాణి ఎడ్లు 2520 అడుగులు లాగి మూడవ బహుమతి రూ.20 వేలు, దక్కించుకున్నాయి.

సత్తా చాటిన గన్నెపల్లె ఎడ్లు

బేస్తవారిపేట: పట్టాభిరామస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా మండలంలోని జేబీకే పురంలో గురువారం ఎడ్ల పోటీలు నిర్వహించారు. పోటీల్లో అర్ధవీడు మండలం గన్నెపల్లెకు చెందిన డీఎంకే బుల్స్ ఎడ్లు 2407 అడుగులు లాగి ప్రథమస్థానంలో నిలవగా, అదే గ్రామానికి చెందిన కె.నక్షత్ర ఎడ్లు 2236 అడుగులతో ద్వితీయస్థానంలో నిలిచాయి. గిద్దలూరు మండలం అలసందలపల్లెకు చెందిన బిజ్జం నారాయణరెడ్డి ఎడ్లు 2201 అడుగులతో తృతీయ, మార్కాపురం మండలం తిప్పాయిపాలెంకు చెందిన శ్రీనివాసరెడ్డి ఎడ్లు 2075 అడుగులతో నాల్గవస్థానంలో, కె.బయనపల్లెకు చెందిన చక్కెర నారాయణరెడ్డి ఎడ్లు 1930 అడుగులతో ఐదవస్థానంలో, సైదాపురంకు చెందిన అట్లా కాశిరెడ్డి ఎడ్లు 1682 అడుగులతో ఆరవస్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానలకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.



వెంగపల్లిలో ప్రథమస్థానంలో నిలిచిన ఎడ్ల జత



బొడిచెర్లలో పోటీలో పాల్గొన్న ఎడ్లు



పొదలకుంటపల్లెలో బండ లాగుతున్న ఎడ్లు